# సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం
- మాల్తుమ్మెద గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు


మాల్తుమ్మెదలో మాట్లాడుతున్న ఏడీఏ రత్నం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రస్తుతం యాసంగిలో వరిసాగు చేసే రైతులు పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం సూచించారు. మండలంలోని మాల్తుమ్మెద రైతువేదికలో మంగళవారం రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరిలో యూరియా ఎక్కువగా వాడకూడదన్నారు. అనంతరం మండలంలోని వదల్‌పర్తిలో పంటనమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏవో విజయశేఖర్, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణ, ఏఈవో బబిత పాల్గొన్నారు.

**తడి–పొడి విధానంపై..**

మాచారెడ్డి/కామారెడ్డి రూరల్: పద్మపాని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి, మాచారెడ్డి మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులకు వరిలో తడి–పొడి విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఏఈవో రజిత, సంస్థ కోఆర్డినేటర్లు కొప్పుల రవి, గోపాల్ వరిలో తడి, పొడి సాగులో పాటించాల్సిన మెలకువలు, నీటినీ పొదుపుగా వాడుటకు సంబంధించి నీటి గొట్టాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరిలో తడి–పొడి విధానంలో భాగంగా నీరు పెట్టడం, ఆర పెట్టడం ద్వారా నీటి వినియోగం తగ్గడంతో పాటు నీటి సామర్థ్యంపెరుగుతుందన్నారు. చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు.



చుక్కాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు.. లింగుపల్లి గ్రామంలో..

**పంటపొలాల పరిశీలన..**

నస్రుల్లాబాద్(బాన్సువాడ)/నిజాంసాగర్/భిక్కనూరు/పిట్లం(జుక్కల్)/రాజంపేట/దోమకొండ: పిట్లం, నస్రుల్లాబాద్, రాజంపేట మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం పంటపొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. నస్రుల్లాబాద్ మండలంలోని సంగ గ్రామ శివారులో 674 ఎకరాల వరి,186 ఎకరాల మొక్క జొన్న సాగు చేశారని ఏఈవో జ్ఞానేశ్వర్ తెలిపారు. పిట్లం మండలంలో బిచ్కుంద ఏడీఏ నూతన్ కుమార్ పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో మోగి పురుగు నివారణకు కార్బోఫురన్ 3జీ గుళికలు 10 కిలోలు లూదా, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 0.4 జీ, క్లోరంట్రనిలిప్రోల్ 0.4 జి గుళికలు 4 కిలోల చొప్పున వాడాలని రైతులకు సూచించారు. అదే విధంగా పైరు నెల రోజుల పైబడి ఉంటే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. రాజంపేట మండలంలో ఏవో జ్యోత్స్న పంటలను పరిశీలించారు. వరిలో ఆశించే పురుగు, తెగుళ్ల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. దోమకొండ మండలంలోని లింగుపల్లి గ్రామాన్ని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సందర్శించారు. కృషి విజ్ఞాన కేంద్రం, రుద్రురు శాస్త్రవేత్తలతో పాటు రాజేంద్రనగర్‌కు చెందిన ప్రధాన శాస్త్రవేత్తల బృందం గ్రామంలో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు అందజేశారు.


పిట్లంలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు


నస్రుల్లాబాద్ మండలంలో..

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌కు వినతిప్రతం అందజేశారు.రాష్ట్ర కార్యదర్శి విఠల్, జిల్లా అధ్యక్షుడు బుల్లెట్, ఉపాధ్యక్షుడు మాణిక్యం, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ విప్‌కు సన్మానం..**

ముదిరాజ్ సంఘ భవనానికి నిధులు, సీసీ రోడ్డు మంజూరుకు హామీ ఇవ్వడంతో పట్టణ ముదిరాజ్ సంఘ సభ్యులు మంగళవారం జిల్లా కేంద్రంలో తన నివాసంలో ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌ను సన్మానించారు. అలాగే రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబోద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్‌లను సన్మానించారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ..**

కామారెడ్డి జిల్లా పీఎంపీ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, పీఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులున్నారు.

## క్లుప్తంగా

### పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలి



నిజాంసాగర్ (జుక్కల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహాన్ని సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి సూచించారు. మండలంలోని మహమ్మద్ నగర్ క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం ఆమె సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బంది భారతి, వజ్ర సంగమని, శైలజ, రమ, మనోహర, సరస్వతి పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని రుద్రారం గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో నారాయణ మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. సర్పంచ్ సత్తయ్య, ఎంపీవో ప్రకాష్ తదితరులు ఉన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

గాంధారి(గాంధారి): మండలంలోని గౌరారం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఎంపీడీవో సతీష్ పరిశీలించారు. సీసీ డ్రైనేజీ, సీసీ రోడ్డుకు వాటర్ క్యూరింగ్ బాగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

### సీపీఐలో మహిళల చేరిక

కామారెడ్డి టౌన్: భారత కమ్యూనిష్టు పార్టీ(సీపీఐ)లో మంగళవారం జిల్లా కేంద్రానికి మహిళలు చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దశరథ్ మాట్లాడుతూ.. ప్రజల పక్షాల సీపీఐ పోరాడటంతో మహిళలు పార్టీలో చేరారన్నారు. నాయకులు బాలరాజు, మనమ్మలు తదితరులు ఉన్నారు.

### ఆర్థికాభివృద్ధి సాధించాలి



రాజంపేట: మహిళా సంఘంలోని సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపీ డీపీఎంలు రవిందర్, రమేష్ బాబు పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం మండల సమాఖ్య పరిధిలో 22 గ్రామ సంఘులకు వీవోఏల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా సంఘాలు జీవనోపాధి, పెంపుదల, ఆర్థికాభివృద్ధి గురించి వివరించారు. డీఎంజీ రాములు, ఏపీఎం సాయిలు పాల్గొన్నారు.

### జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా శ్రావణిని నియమించాలి



కామారెడ్డి అర్బన్: జగిత్యాల ఎమ్మెల్యే వేధింపులతో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసిన భోగ శ్రావణిని మళ్లీ చైర్‌పర్సన్‌గా నియమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, మహిళ జిల్లా అధ్యక్షురాలు మ్యాదరి లక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంఘ నాయకులు మోహనాచారి, రాజయ్య, సుమప్రియ, మాధవి, సంతోషిని ఉన్నారు.

### తహసీల్దార్‌కు వీఆర్‌ఏల వినతి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి తహసీల్దార్ సుధాకర్‌కు వీఆర్‌ఏలు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. వీఆర్‌ఏల సమస్యల సాధన కోసం రాష్ట్ర వీఆర్‌ఏల జేఏసీ పిలుపు మేరకు ఈనెల 1, 2 తేదీలలో మౌన దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. దీనికి అనుమతిని ఇవ్వాలని కోరుతూ వీఆర్‌ఏలు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. వీఆర్‌ఏలు శ్రీనివాస్, వెంకట్ తదితరులు ఉన్నారు.

### డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా, యూనిట్ల డైరీ, క్యాలెండర్లను మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్, ట్రెజరీ అధికారి సాయిబాబా ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు, కార్యదర్శి గంగాగౌడ్, ప్రతినిధులు మల్లేషం, ఎస్.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### కేసులను పరిష్కరించాలి



రామారెడ్డి(ఎల్లారెడ్డి): పెండింగ్‌కేసులను త్వరగా పరిష్కరించాలని కామారెడ్డి డీఎస్పీ సురేష్ సూచించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై అనిల్, ఏఎస్సై సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రజల కోసమే బీఆర్‌ఎస్ ఏర్పాటు

- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- మర్కల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): దేశ ప్రజల సంక్షేమం కోసమే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. మండలంలోని మర్కల్ మల్లన్నగుట్ట గుట్ట వద్ద గల అశోక్ గార్డెన్స్‌లో మంగళవారం సదాశివనగర్, రామారెడ్డి మండలాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి కనిపించకపోతే ప్రతిపక్ష నాయకులు కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంతో యావత్ దేశం లోని రాష్ట్రాలన్నీ తెలంగాణ వైపు చూస్తున్నాయన్నారు. సర్పంచ్ సంగారెడ్డి, ఎంపీపీలు అనసూయ, దశరథ్‌రెడ్డి, జెడ్పీటీసీ నర్సింలు, మహేందర్ రెడ్డి, భూంరెడ్డి, కమలాకర్ రావు, గంగాధర్, రాంరెడ్డి, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

## పోడు భూములకు పట్టాలివ్వాలి


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నేతలు

మాచారెడ్డి: ఎన్నో ఏళ్లుగా పోడు భూములను సాగు చేసుకొని జీవిస్తున్న పేదలకు భూ పట్టాలివ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వేల్పూరు భూమన్న డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన రైతులతో కలిసి మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన్న మాట్లాడారు. మండలంలోని ఎల్లంపేట, సోమారంపేట, అక్కా పూర్,లచ్చాపేట గ్రామాల్లోని నిరుపేదల పోడు, లావన్ పట్టా భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేసి, రైతుబంధు ఇవ్వాలని కోరారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రం చేస్తామని పేర్కొన్నారు. నాయకులు నర్సన్న, ఆలీ, సుమన్, రాజిరెడ్డి, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

## 'హాత్ సే హాత్ జోడో'ను జయప్రదం చేయండి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో ఈనెల 6 నుంచి నిర్వహించనున్న 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమాన్ని విజయవంతం చేయలని మాజీ ఎమ్మెల్యే సౌదగర్ గంగారాం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు విఠల్‌రెడ్డి, బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆవాస బడి' మూడు నెలలేనా?



రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఇటుక బట్టీల్లో పని చేసే కూలీల పిల్లలను చదువు బాట పట్టించేందుకు ఏర్పాటు అయ్యే ఆవాస ప్రాంత బడుల ప్రారంభం ఆలస్యం జరుగుతుంది. మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో డీఈవో రాజు, ఎంఈవో యోసేఫ్ ఇటుక బట్టీలో పని చేస్తున్న కూలీల పిల్లల కోసం ఆవాసప్రాంత పాఠశాలను ప్రారంభించారు. ఏప్రిల్ 23న స్కూళ్లకు వేసవి సెలవులు మొదలు కానున్న నేపథ్యంలో కేవలం 3నెలలు మాత్రమే పని చేయనున్నాయి. పాఠశాలను ఆలస్యంగా ప్రారంభించడంపై ఎంఈవోను వివరణ కోరాగా.. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే ప్రారంభించినట్లు తెలిపారు.

## ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి


తాద్వాయిలో మాట్లాడుతున్న అధికారులు

తాద్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఉపాధిహామీ సిబ్బంది, గ్రామ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పనులను గుర్తించాలని, కూలీల సంఘాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

**లింగంపేట మండలంలో..**

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని కూలీలకు 100 రోజులు పని కల్పించేలా చూడాలని ఆదేశించారు. అలాగే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

## ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తారు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తారని కాంగ్రెస్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఎద్దేవ చేశారు. మండలంలోని మర్కల్, తిర్మన్‌పల్లి, అమర్లబండ, మల్లుపేట్ గ్రామాలలో మంగళవారం ఆయన హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు కష్టాలను తెలుసుకుంటూ, వారిని ఓదారుస్తూ యాత్రను కొనసాగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయం అందిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు

## కంటి వెలుగు శిబిరం ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణపరిధిలోని లింగారెడ్డిపేట గ్రామంలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణప్రారంభించారు. కౌన్సిలర్ రాము, మున్సిపల్ కమీషనర్ జగ్జీవన్ తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజరలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ అరుణ, తహసీల్దార్ సయీద్ అహ్మద్ మస్రూర్, కార్యదర్శి మమత పాల్గొన్నారు.

**లింగంపేట మండల కేంద్రంలో..**

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోతె, లింగంపేట గ్రామాల్లో కంటి వెలుగు శిబిరంలో మంగళవారం 282 మందికి పరీక్షలు చేసి 92 మందికి కంటి అద్దాలు, మందులు అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు హిమబిందు, యాదగిరి, రాజేశ్వరీ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

■ **ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన**



నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి(దాబా) గ్రామంలోని శివాలయంలో మంగళవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ప్రారంభించినట్లు ఆలయ కమిటి సభ్యురాలు కాషబాయి తెలిపారు. నేడు విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. విగ్రహానికి బైరాపూర్ గ్రామానికి చెందిన సంజీవ్ గౌడ్ రూ.40వేలు విరాళం అందించారని అన్నారు.

■ **దుర్గామాత ఆలయ వార్షికోత్సవం**

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని గన్‌శెట్టి హనుమాన్ ఆలయంలో మంగళవారం దుర్గామాత ఆలయం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

■ **శివాలయంలో ప్రత్యేక పూజలు**

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి శివాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాజపోషకుల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**మైసమ్మ ఆలయంలో..**

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలోగల మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ కమిటి సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

■ **ఎల్లారెడ్డిలో చండీహోమం**

ఎల్లారెడ్డి: పట్టణంలో మంగళవారం చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే సురేందర్ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కంచర్ల లింగం, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ ఉన్నారు.

## నూతన కార్యవర్గం..

**కామారెడ్డి మండల పద్మశాలి సంఘం..**



కామారెడ్డి టౌన్/కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో మంగళవారం కామారెడ్డి మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆసం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చింతల లక్ష్మీ నర్సింలు, ఉపాధ్యక్షులుగా విట్టం శ్రీని వాస్, కోశాధికారిగా శ్యామల బాబు, ఉప కార్యదర్శిగా నరేష్, కార్యవర్గ సభ్యులుగా లక్కపత్ని శ్రీనివాస్, రాజేష్, పసుపు కంటి రవి, ప్రకాష్‌లను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింలు, నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

## సమాచారం..

■ **3 నుంచి బాన్సువాడలో ప్రోకబడ్డీ పోటీలు**



బాన్సువాడ టౌన్: ఈ నెల 3నుంచి 5వరకు బాన్సువాడ మినీ స్టేడియంలో ప్రో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. పట్టణంలో మంగళవారం ప్రో కబడ్డీ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. గంగాధర్ మాట్లాడుతూ కీ.శే. పరిగె పాపమ్మ–రాజిరెడ్డిల స్మారకార్థం వారి కుమారుడు పోచారం శంభూరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు.

■ **నర్సు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం**

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో స్టాఫ్ నర్సు పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ రీజినల్ కో–ఆర్డినేటర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం పూర్తిచేసిన అభ్యర్థులు నస్రుల్లాబాద్ పాఠశాలలో దరఖాస్తు సమర్పించాలన్నారు.

■ **టైలరింగ్, బ్యూటీ పార్లర్ కోర్సులకు..**

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ సహకారంతో స్వయం ఉపాధి కోసం మహిళలు, గృహిణులకు టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్, మెహిందీ డిజైన్ ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు దేవునిపల్లి విద్యుత్‌నగర్ కాలనీలోని అక్షయ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ భూపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు నేటి శిక్షణకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 74167 13338ను సంప్రదించాలన్నారు.

■ **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో లైన్‌మెన్ కొండల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలు, స్తంభాల మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్ర 6.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

■ **'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించాలి..**

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులు ఈనెల పదిలోపు పరీక్ష ఫీజులను చెల్లించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో 22 వరకు చెల్లించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 98663 43898ను సంప్రదించాలన్నారు.

## పశువులకు వ్యాధినివారణ టీకాలు



లింగంపేట/సదాశివ నగర్(ఎల్లారెడ్డి) /మద్నూర్(జుక్కల్): లింగంపేట, మద్నూర్, సదాశివనగర్ మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం కోరుట్ల పశువైద్యశాల, పశువైద్య పశుసంవర్ధక శాఖ, పాల సమాఖ్య కేంద్రం కామారెడ్డి, జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పశువైద్య సిబ్బంది పశువులకు వ్యాధినివారణ టీకాలు వేశారు.

## సంక్షిప్తం

**పోస్టర్ల ఆవిష్కరణ**

నిజాంసాగర్ (జుక్కల్): గాంధారి ఖిల్లా మైసమ్మ మహాజాతర ఉత్సవాల పోస్టర్లను మంగళవారం నిజాంసాగర్‌లో ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం జిల్లా అధ్యక్షులు పెంటయ్య ఆవిష్కరించారు. సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

**ఇసుక వేలం పాట**

బిచ్కుంద(జుక్కల్): అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డ ఇసుకకు మండలకేంద్రంలో మంగళవారం రెవెన్యూ అధికారులు వేలం నిర్వహించారు. నాలుగు బొలేరో వాహనాలలో ఉన్న ఇసును వేలం వేయగా ప్రభుత్వానికి రూ.8,400 ఆదాయం వచ్చిందని ఆర్ఐ సాయిబాబా తెలిపారు.

**స్టడీ మెటీరియల్ అందజేత**

పిట్లం(జుక్కల్): మండలంలో పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు మంగళవారం పిట్లంకు చెందిన నవాబ్ శివకుమార్ గౌడ్ (చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్) స్టడీ మెటీరియల్‌ను పంపించగా, స్థానిక నాయకులు అందజే శారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**వైకుంఠధామానికి విరాళం**

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి వైకుంఠధామానికి మంగళవారం లింగాపూర్‌కు చెందిన కొమిరెడ్డి పెద్ద నారాయణ ఆయన తండ్రి సాయన్న జ్ఞాపకార్థం రూ. 50 వేలను అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం అందజేత**



రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందగా.. బాధిత కుటుంబానికి మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ రూ.11వేల ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లావాసికి 'ఇస్రో అవార్డు'**

కామారెడ్డి: కేరళ రాష్ట్రంలోని సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2023లో ప్రతిభ చూపిన చిన్నమల్లారెడ్డి జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణకు ఇస్రో అధికారులు ప్రత్యేక అవార్డును అందించారు. రామకృష్ణ తయారు చేసిన డోంట్ నోస్– మై హైట్ ప్రదర్శనకు అవార్డు అందజేశారు.

**అమ్ముడుపోయిన వ్యక్తులను నిలదీస్తాం**

రామారెడ్డి(ఎల్లారెడ్డి): గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రచారం చేసి, ఎమ్మెల్యే సురేందర్‌ను గెలిపించామని, అమ్ముడుపోయిన వ్యక్తులను బరాబర్ నిలదీస్తామని పార్టీ నాయకులు హె చ్చరించారు. మండలంలోని ఉప్పల్‌వాయిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నేత కుమార్ మాట్లాడారు. మండల రైతుబంధు కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి సబ్సిడీ హార్వెస్టర్‌ను అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడ ని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులున్నారు.

**గ్రంథాలయం పరిశీలన**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట శాఖ గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ తనిఖీ చేశారు. పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. గోపాల్‌పేట హైస్కూల్‌లో విద్యార్థులకు ఆయన డైరీలను అందజేశారు.